క్లుప్తంగా

పేదల వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వండి



బర్డ్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేత కందారపు మురళి

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రిలో పేదల వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి, ఆపరేషన్లు ఆలస్యం కాకుండా చూడాలని ఆ ఆస్పత్రి డైరెక్టర్ జగదీష్‌కు సీపీఎం నేత కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బర్డ్ ఆస్పత్రి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ సామాన్యులకు ప్రాధాన్యత నిచ్చి, వారికి తోడ్పడేందుకు నిర్దిష్ట చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మోకాలు బాధితులు పెరగడంతో కీళ్ల మార్పిడికి కొంత సమయం పడుతోందన్నారు. ప్రస్తుతం శస్త్రచికిత్సలు పెంచి దశలవారీగా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నామని, పేదలు, సామాన్య ప్రజలకు బర్డ్ అందుబాటులో ఉంటుందని డైరెక్టర్ జగదీష్ హామీ ఇచ్చారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

తిరుపతి సిటీ: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు టీటీడీ పాఠశాలల్లో నిర్వహించిన సద్గమయ శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు భక్తి భావం, భగవద్గీత, మానవీయ కోణం, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, క్విజ్, సింహావలోకనం, విద్యార్థులలో సజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలు, మన సంస్కృతి – సాంప్రదాయాలు తదితర అంశాలపై విశ్లేషనాత్మకంగా శిక్షణ ఇచ్చారు.

ఎస్వీవీయూ రిజిస్ట్రార్‌కు సన్మానం



డాక్టర్ రవికుమార్‌ను సత్కరిస్తున్న వెటర్నరీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న డాక్టర్ రవికుమార్ గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెటర్నరీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను పూలమాల, శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ రవికుమార్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. వెటర్నరీ రిజిస్ట్రార్ అందరికీ అందుబాటులో ఉంటూ పారపచ్చాలకు తావులేకుండా విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు నాయక్, సభ్యులు వినోద్ కుమార్, లక్ష్మీ కవిత, నవీన్, కుమార్, సుష్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ..ఉద్యోగావకాశం

తిరుపతి అర్బన్: నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో మధ్యాహ్నం ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పిస్తామని చెప్పారు. 80 శాతం ప్రాక్టికల్స్‌పై శిక్షణ, 20 శాతం థియరీపై శిక్షణ ఉంటుందన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(ఎన్ఏసీ),ఎస్సీ కార్పొరేషన్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా శిక్షణ పొందిన వారికి ఏపీఎస్ఎస్‌డీసీ అండ్ ఎన్ఎస్‌డీసీ వారిచే జారీ చేసిన ఎన్‌సీవీఈటీ సరిఫికెట్ అందిస్తామని చెప్పారు. ప్రముఖ కంపెనీలతోపాటు గుర్తింపు పొందిన పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. శిక్షణకు సంబంధించి మీ సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వారి ద్వారానే జిల్లా సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయానికి దరఖాస్తులు చేర్చాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

హాస్టళ్లలో 'సంక్షేమం' ఎక్కడ?

- ప్రభుత్వ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువు
- చంద్రగిరి నియోజకవర్గంలో మరింత దారుణం
- హాస్టల్‌బాట కార్యక్రమంలో భాగంగా వసతిగృహాలను పరిశీలించిన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

రామచంద్రాపురం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సంక్షేమ జాడ కనిపించడం లేదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సొరకాయలపాళెం ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి విభాగం నేతలతో కలసి గురువారం రాత్రి ఆయన పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, ఆహార పదార్థాలు నాసిరకం వినియోగిస్తున్నట్లు ఆయన గుర్తించారు.

హాస్టల్ విద్యార్థులపై చిన్నచూపు..

చదువుకునే స్తోమత లేక ప్రభుత్వ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మండిపడ్డారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అందించిన బ్యాగులు నాసిరకంగా ఉండడంతో చిరిగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్న దుప్పట్లను అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించడం లేదని.. విద్యార్థులు నేలపైనే నిద్రపోతున్నారని, వారికి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. మరుగుదొడ్లలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని.. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులపై నివేదిక సిద్ధం చేశామని, నివేదికతో పాటు సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓబుల్ రెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు చెంగల్ రెడ్డి, వినోద్, దినేష్, రఫి, శేషారెడి, నాయకులు భాస్కర్ యాదవ్, ముక్కోటి తదితరులు పాల్గొన్నారు.



నేలపై చదువుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్న విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఇచ్చిన బ్యాగు చిరిగిపోయిన దృశ్యం



నాసిరకం బ్యాగు ఇచ్చారంటూ చెవిరెడ్డి హర్షిత్‌కు వివరిస్తున్న విద్యార్థి



విద్యార్థులకు అందించే ఆహారాన్ని రుచి చూస్తున్న చెవిరెడ్డి హర్షిత్

స్మార్ట్‌మీటర్లు వ్యతిరేకించండి

తిరుపతి కల్చరల్: స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ నేత ఎన్‌డీ.రవి, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత పి.వెంకటరత్నం పిలుపునిచ్చారు. సామాన్యులకు పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష నేతల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్యనగర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రిది ఒక మాట, అధికారుల మాటలు మరో మాటగా ఉందన్నారు. అదాని కంపెనీ స్మార్ట్ మీటర్లను దొంగల మాదిరిగా ఇళ్లల్లో ఎవరూ లేనప్పుడు వచ్చి అమర్చుతున్నారన్నారు. ప్రజల అంగీకారం ఆమోదం లేనిదే మీటర్లను అమర్చవద్దని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారన్నారు. అయితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విద్యానంద్ మాత్రం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు త్వరగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించడం అంటే మంత్రి మాటకు ఏ మాత్రం లెక్క చేయడం లేదన్న విషయం బహిర్గమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు టి.సుబ్రమణ్యం ,వేణుగోపాల్, పి.సాయిలక్ష్మి, హేమతల, బుజ్జి, చిన్న, నరేంద్ర, జయంతి, రామకృష్ణ, సీపీఎం నేతలు శివ, ప్రమీల, సీపీఐ (ఎంఎల్) నేతల లోకేష్, అరుణ పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేస్తున్న వామపక్ష నేతలు

మాజీ సర్పంచ్ నంగా గీతారెడ్డికి నివాళి



పాకాలలో నంగా గీతారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి కుటుంబసభ్యులు



నంగా నరేష్‌రెడ్డిని ఓదార్చుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- పాకాలలో నంగా నరేష్‌రెడ్డికి సతీవియోగం
- నివాళులు అర్పించిన చెవిరెడ్డి కుటుంబం

తిరుపతి రూరల్/చంద్రగిరి/పాకాల : చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ముందుగా చిగురువాడ గ్రామానికి చేరుకుని వేమూరు విజయసింహారెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరై ఆ దంపతులకు అభినందనలు తెలిపారు. అనంతరం చంద్రగిరి మండలం శంకరయ్యగారిపల్లి వద్ద బీజీఆర్ కన్వెక్షన్ హాలు అధినేత బుచ్చిరెడ్డిగారి గోవిందరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించి కర్మక్రియల్లో పాల్గొన్నారు. ఆ తరువాత తన వ్యక్తిగత డ్రైవర్ మణికంఠ నానమ్మ ఇటీవల మృతి చెందడంతో తొండవాడ వద్ద ఉన్న అగ్రహారంలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పాకాల మండల పార్టీ అధ్యక్షుడు నంగా నరేష్‌రెడ్డి సతీమణి మాజీ సర్పంచ్ నంగా గీతారెడ్డి మృతి చెందడంతో అక్కడకు వెళ్లి ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు అతని తల్లి చెవిరెడ్డి లక్ష్మి, సోదరుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి కూడా నంగా గీత భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పర్యటనలో ఆయనతో పాటు తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మునీశ్వర రెడ్డితో పాటు ఆర్సీపురం జెడ్పీటీసీ సభ్యులు ఢిల్లీరాణి ఉన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వలేని దుస్థితిలో సర్కార్

తిరుపతి అర్బన్: సర్కారు రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేని దుస్థితిలో ఉందని, డీలర్లు సక్రమంగా ఇవ్వకపోయిన జిల్లా సివిల్ సప్లయి అధికారులు సీరియస్‌గా తీసుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మండిపడ్డారు. ఈ అంశంపై జిల్లా సివిల్ సప్లయి అధికారి శేషాచలం రాజుకు వినతిపత్రం అందించి సమస్యలను తెలియజేయడం కోసం గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌కు వచ్చామని తెలిపారు. అయితే గురువారం సాయంత్రం 4 గంటలకే ఆఫీస్ మొత్తం ఖాళీగా ఉందని, ఒక్కరంటే ఒక్కరు ఆఫీస్‌లో లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లయి అధికారుల తీరును జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు దృష్టికి తీసుకెళతామన్నారు. కూటమి సర్కార్‌లో ఇచ్చేది కేవలం బియ్యం మాత్రమేనని, కందిపప్పుతోపాటు ఇతర సరుకులు ఇవ్వడం ఎప్పుడో మానుకున్నారని పేర్కొన్నారు. అవి కూడా సక్రమంగా ఇస్తున్నారా అంటే అదీ లేదన్నారు. ఒకటి నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు బియ్యం ఇవ్వాల్సి ఉందని, అయితే డీలర్లు 8వ తేదీకే దుకాణం సర్ది పెట్టేస్తున్నారని మండిపడ్డారు. జేసీ శుభం బన్సల్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. ఆయనతోపాటు హేమలత ఉన్నారు.



సాయంత్రం 4 గంటలకే ఖాళీగా దర్శనమిస్తున్న డీఎస్ఓ ఆఫీస్

శేష జీవితం ఆనందంగా గడపాలి

తిరుపతి తుడా: విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుకులు ఎదుర్కొని, ఎంతోకాలం సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారందరూ తమ శేషజీవితం ఆనందంగా గడపాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ మౌర్య అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన అసిస్టెంట్ ఎగ్జామినర్ రంగయ్య, ఏసీపీ బాలాజీలను గురువారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగులకు సర్వసాధారణమన్నారు. తాను ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎంతో మంది ప్రజలకు సేవలు అందించి ఉంటారని, ఉద్యోగంలో ఎన్నో ఒత్తిడులు ఎదుర్కొని పని చేసిన వారు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్, మేనేజర్ హాసీమ్, తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఉద్యోగులతో కమిషనర్

సన్మానం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సుమారు 67 మంది బోధనేతర ఉద్యోగులను గురువారం సెనేట్ హాల్‌లో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి బోధనేతర సిబ్బంది నిరంతర కృషిపై ఆధారపడి ఉంటుందన్నారు. బోధనేతర సిబ్బంది ఎంతో నైపుణ్యం కలిగిన వారు ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రతి సెక్షన్‌లో మార్గదర్శకాలు బోధనేతర సిబ్బంది చొరవతో సిద్ధమవుతాయన్నారు. విశ్వవిద్యాలయానికి బోధన, బోధనేతర సిబ్బంది రెండు కళ్లు వంటి వారని, అనేక రకాల కారణాలతో 2022 నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం జరగలేదని, ఈ రోజు గతంలో ఉద్యోగ విరమణ పొందిన వారితో పాటు నేడు ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు గౌరవంగా సత్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది అధ్యక్ష , కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం, డిప్యూటీ రిజిస్ట్రార్ చంద్రయ్య, సునీత విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

జీఓలు.. తప్పుల తడకలు!

తిరుపతి సిటీ : కూటమి ప్రభుత్వ విడుదల చేస్తున్న జీఓలు తప్పుల తడకలుగా ఉండడంతో పలువురు మండిపడుతున్నారు. చేతకాని పాలన అంటూ ఎద్దేవా చేస్తున్నారు. అధిక ప్రాధాన్యత గల జీఓలను సైతం అపహాస్యం చేసేలా అబద్ధాలతో నింపడంపై విద్యావంతులు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో తమ అనుచరులను నియమిస్తూ జీఓ జారీచేసింది. టీడీపీ వర్గీయులుగా ముద్రపడిన అధ్యాపకులు, విశ్రాంత ఉద్యోగులకు పదవులు కట్టబెట్టింది. అందులో భాగంగా ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యులుగా నలుగురిని నియమిస్తూ జీవో నంబర్–262ను విడుదల చేసింది. ఇందులో తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తూ 2017లో ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ వీఆర్ రాసానిని సైతం సభ్యుడిగా నియమించింది. ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో డాక్టర్ రాసానిని ఎస్వీయూ ప్రొఫెసర్‌గా పేర్కొనడం గమనార్హం.

దుమ్మెత్తి పోస్తున్న నెటిజన్లు

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 262 నెట్టింట వైరల్ అవుతోంది. తప్పుల తడకగా ముద్రించి జీఓ విడుదల చేయడంపై నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు.



ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీఓ

ప్రభుత్వ తప్పిదమే

ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యుడిగా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం నుంచి నాకు జీఓ అందింది. అందులో ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ వీఆర్ రాసాని అంటూ తప్పుగా ముద్రించారు. నేను ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడిగా ఉద్యోగ విరమణ పొందాను. నేను బయోడేటాలో అదే పేర్కొన్నాను. ఇది కచ్చితంగా ప్రభుత్వ తప్పిదమే.

– వీఆర్ రాసాని, విశ్రాంత అధ్యాపకుడు

• అధ్వాన్నం

రుయాలోని ఇన్ పేషెంట్ వార్డు భవనం పాచి పట్టి ప్రమాదకరంగా మారింది. ఆస్పత్రి పరిపాలన భవనం వెనుక ఉన్న మేల్, ఫిమేల్ వార్డులలో భవన లీకేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు భవనంలోకి లీకేజీ అవడంతో గోడలకు పూర్తిగా పాకుడు పట్టింది. అయితే అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే వార్డు పరిసరాల్లో సైతం పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైంది. - తిరుపతి తుడా



నోటీస్ బోర్డు

- తిరుపతి నగరంలోని లబ్ధిదారులకు ఉదయం 6.30 గంటలకు పింఛన్లు పంపిణీ.
- రాయలసీమ రంగస్థలి కళాకారుల ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు వీవీ మహల్ రోడ్డులోని ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం
- జిల్లా స్థాయిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు తల్లి పాలు వారోత్సవాలు ప్రారంభం.
- తరిగొండ వెంగమాంబ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 9 గంటలకు భక్తి సంగీతం, 10 గంటలకు వెంగబాంబ సాహిత్యంపై సదస్సు, సాయంత్రం 6 గంటలకు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు.
- ఎస్వీ యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా.
- లిటిల్ స్టార్ పాఠశాల క్రీడా మైదానంలో బాల బాలికలకు ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు.
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారికి సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం.

ధర్నా విజయవంతం చేయండి

తిరుపతి సిటీ: ఫ్యాప్టో పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శనివారం రాష్ట్ర వ్యాప్తం జరిగే ధర్నాను ఉద్యోగులు విజయవంతం చేయాలని ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) ఛైర్మన్ ఎస్ సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12వ వేతన సవరణ సంఘం నియమించాలని, వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, తదితర 18 డిమాండ్లతో నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను జిల్లా స్థాయి ప్రాజెక్టుతోపాటు అంగన్‌వాడీ స్థాయిలో చేపట్టాలని ఐసీడీఎస్ పీడీ వసతంబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిపాల వారోత్సవం ప్రాధాన్యతను స్పష్టంగా తల్లులకు తెలియజేయాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తిని పెంచే కారకాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా పోలీసులు అధికారుల ఆదేశాల మేరకు 'యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం ఫర్ స్టూడెంట్స్' అనే కార్యక్రమాన్ని గురువారం ఎస్వీయూ లా విభాగం, స్కూల్ ఆఫ్ ఫార్మసీ విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థులకు డ్రగ్స్ సేవిస్తే కలిగే పరిణామాలు, కేసులు, శిక్ష వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మలబార్‌లో ఆభరణాలపై ప్రత్యేక ఆఫర్లు

తిరుపతి కల్చరల్: వరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రకాశం రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో బంగారు, వజ్రాభరణాలపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు ఆ షోరూం హెడ్ రిజేష్ తెలిపారు. పండుగ సందర్భంగా అన్ని బంగారు, అన్‌కట్ వజ్రాలు, రత్నాభరణాల తరుగు ఛార్జీలపై 30 శాతం ఫ్లాట్ తగ్గింపుతో అందించనున్నట్లు పేర్కొన్నారు. అదనంగా వజ్రాల విలువపై 30 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. ప్రతి పండుగకు ప్రాముఖ్యతను జోడించడానికి ఆలోచనాత్మంగా రూపొందించిన 100 శాతం జెన్యూన్ ఆఫర్లు ఆగస్టు 8వ తేదీ వరకు ఉంటాయన్నారు.

ఎంబీయూలో కాన్వొకేషన్ డే రేపు

చంద్రగిరి: మండలంలోని శ్రీసాయినాథ్ నగర్‌లో వెలసిన మోహన్‌బాబు యూనివర్సిటీలో శనివారం ఎంబీయూ 2వ కాన్వొకేషన్ డేతో పాటు శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల 14వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు ఎంబీయూ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు ప్రఫుల్ పటేల్, యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు హాజరు కానున్నారు. విశిష్ట అతిథులుగా ప్రోచాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరితో పాటు వీసీ ఆచార్య నాగరాజ రామారావు పాల్గొననున్నారు. ఎంబీయూ ద్వారా 866 మంది విద్యార్థులు, శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1,698 మంది విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆనందన్ శివమణి, మహారాష్ట్రకు చెందిన లోక్‌మత్ పత్రిక అధ్యక్షుడు విజయ్ జవహర్ దార్దాలకు ఎంబీయూ నుంచి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి. శనివారం ఉదయం 10 గంటలకు ఎంబీయూలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

మొక్కబడి



మొక్కల పెంపకాన్ని మొక్కుబడిగా మార్చారు. సంరక్షణ కొరవడి నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. భవిష్యత్‌లో పచ్చదనం పంచాల్సిన వాటికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన ప్రజాప్రతినిధి, కూటమి నేతలు, అధికారులు అలక్ష్యం వహించడంతో మొక్కదశలోనే వాడిపోతున్నాయి. ఇందుకు చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్ మండలం చిగురువాడ మీదుగా రాయల చెరువుకు వెళ్లే ప్రధాన మార్గంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవలే ఎమ్మెల్యే పులివర్తి నాని, అధికారులు, కూటమి నేతలు మొక్కలే నిదర్శనం. నాటిన రోజున మొక్కల వద్ద సెల్ఫీలతో హడావుడి చేసిన నేతలు ఆ మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టడం లేదు. నీరు లేక ఎండకు ఎండిపోయి, వాడిపోయి నేలకొరిగిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



